క్లుప్తంగా

శ్రీ రామ నామ క్షేత్రంలో వజ్రోత్సవాలకు సన్నాహాలు



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో కొలువైన శ్రీ రామ నామ క్షేత్రం ఆవరణలో శ్రీ రామ నామ స్మరణ ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో 75వ వజ్రోత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. క్షేత్ర స్వామి వారికి శాశ్వత నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో వజ్రోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రత్యేక యజ్ఞ యాగాదులు 7 రోజుల ఉంటాయని పేర్కొన్నారు. సంఘానికి ఎంతో మంది వ్యక్తులు సేవలు అందిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో నివసిస్తున్న రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. ఆయన చెరుకుపల్లి సమీపంలోని నడింపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా గురువారం భట్టిప్రోలు టీడీపీ నాయకులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు



ఐలవరం(భట్టిప్రోలు): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం బాల్య వివాహాలపై అవగాహన కలిగించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ సంపూర్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఆమె మాట్లాడుతూ.. కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల నష్టాలు తెలియాలని చెప్పారు. వాటి నిరోధానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు



భట్టిప్రోలు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేసిందని బాపట్ల జిల్లా జీఎస్టీ కార్యాలయ అధికారి మారుతి ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు దీనిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు వస్తువులపై ధర తగ్గించడంతో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. జీఎస్టీ కరపత్రాలను ప్రదర్శించారు. అదనపు సమాచారం కావాలంటే బాపట్ల జీఎస్టీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మాఝీనాయక్, ఫార్మసిస్ట్ బి.నాగకన్యాదేవి, సీహెచ్‌వో బి.మంగరాజు ఉన్నారు.

అన్ని యూనిట్లు పనిచేసేలా చూడండి

తెనాలి అర్బన్: కంపోస్టు యార్డులోని అన్ని యూనిట్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పల నాయుడు ఆదేశించారు. బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డును గురువారం ఆయన పరిశీలించారు. వ్యర్థాల తరలింపుపై ఆరా తీశారు. అలాగే వర్మీ కంపోస్టు, బయోగ్యాస్, కోకోపిట్, ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్‌ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. వాటిలో ఎస్ఎఫ్‌టీపీ, బయోగ్యాస్ ప్లాంట్‌లు రిపేర్లో ఉన్నాయని ఆయన తెలిపారు. వాటికి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

14న దమ్మ దీక్షా దిన వేడుకలు

భట్టిప్రోలు: ది ఆది ఆంధ్ర నవ బుద్ధిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రంలో బీఆర్ అంబేడ్కర్ 70వ దమ్మ దీక్షా దిన వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు దోవ రమేష్ రాంజీ, డాక్టర్ పర్రె కోటయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తలుగా రచయిత, చరిత్ర పరిశోధకులు బొనిగల రామారావు, బహుజన రచయితల వేదిక తంగిరాల సోని, కె.కె. బోధి విచ్చేయనున్నారు. సన్మాన గ్రహీతలైన బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్, కంచర్ల శేషుకుమార్ తమ సందేశాన్ని అందిస్తారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో కార్యకర్తలకే పెద్దపీట

పార్టీ మండల కమిటీ సమావేశాల్లో వేమూరు సమన్వయకర్త వరికూటి



పెరవలిలో ప్రసంగిస్తున్న వరికూటి అశోక్‌బాబు



సుగ్గునలంకలో మాట్లాడుతున్న అశోక్‌బాబు

పెరవలి(వేమూరు)/ కొల్లూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆ పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు తెలిపారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఇందులో వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ.... పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాబోయే కాలంలో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారని గుర్తుచేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పార్టీ విజయం కోసం కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వంలో రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతోందని మండిపడ్డారు. దానిని ఎదుర్కోవాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి నియోజక వర్గం నుంచి 14 వేల మందితో కమిటీలు వేయాలని అధినేత సూచించారన్నారు. వేమూరు నియోజకవర్గం 6 వేల మందితో కమిటీలు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలోనే ఈ విషయంలో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందన్నారు. అన్యాయానికి గురువుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కోసం రూపొందించిన డిజిటల్ బుక్‌లో ఫిర్యాదుల నమోదుకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని సూచించారు. బాధ్యులైన అధికారులపైనా తర్వాత చర్యలు తీసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు, అమర్తలూరు, కొల్లూరు మండల పార్టీ అధ్యక్షులు పడమట శ్రీనివాసరావు, హిమచంద్ర శ్రీనివాసరావు, సుగ్గల నాగమల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, చిలుమూరు రామోహనరావు, జల్లి జోషి కాంత్, బెల్లకొండ పార్వతి, గోపాలం రాము, బొల్లిముంత ఏడుకొండలు, గాజుల భానుప్రకాశ్, దాసరి పోతురాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కుయుక్తులను తిప్పికొట్టాలి

కూటమి ప్రభుత్వ కుయుక్తులను తిప్పికొట్టి ప్రజలకు మేలు చేకూరేలా వైఎస్సార్ సీపీ శ్రేణులు పోరాటం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని సుగ్గునలంకలో నిర్వహించిన పార్టీ మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాల్సిందిపోయి వారిని కష్టాల కడలిలోకి నెట్టడానికి కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఆరోపించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పాటుపడ్డారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సమయంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ఇప్పుడు ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వీటిని కొనసాగించేందుకు ఆందోళనలు తీవ్రం చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఈ దిశగా సంతకాల సేకరణ జరపాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలను సైతం సక్రమంగా అమలు చేయకుండా ప్రజల జీవన స్థితిగతులను అల్లకల్లోలం చేస్తోందన్నారు. నేడు ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పెరికల పద్మారావు, గాదె శివరామకృష్ణారెడ్డి, కూచిపూడి మోషే, ఆళ్లమూడి మధు, గుంటూరు పవన్, గరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మోపర్రులో సమావేశం

అమర్తలూరు (వేమూరు): అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు హిమచంద్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు హాజరు అవుతారని చెప్పారు. మండల స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన తెలిపారు.

నేడు శిక్షణ తరగతులు

రేపల్లె: ప్రథమ చికిత్స, సీపీఆర్ చేసే విధానాలపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచి చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య పర్యవేక్షణలో గుంటూరు బృందం సభ్యులు రసూల్ తదితరులు శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

తెనాలి జిల్లా ఏర్పాటుకు వినతి

రేపల్లె: రేపల్లె, వేమూరు, తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలతో కలిపి తెనాలి జిల్లా కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి,.మోహనరావు కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. తెనాలి జిల్లాగా ఏర్పడితే ఆయా నియోజకవర్గాల ప్రజలకు రవాణాపరంగా, ఇతర కార్యకలాపాలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వేమూరు, రేపల్లె ప్రజలు జిల్లా కేంద్రమైన బాపట్లకు నేరుగా చేరేందుకు రవాణా సౌకర్యాలు అంతంత మాత్రమేనని గుర్తుచేశారు. బాపట్లకు వెళ్లాలంటే వ్యయప్రయాసలు తప్పడం లేదన్నారు. గత ప్రభుత్వం రేపల్లె రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేసి కొంత వరకు సమస్యను పరిష్కరించిందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా ప్రస్తుత ప్రభుత్వం ఆయా నియోజక వర్గాలతో తెనాలి జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు.

గ్రామ సచివాలయంలో సేవలు ‘ఖాళీ’

- సకాలంలో నిర్దేశిత సేవలు అందక తప్పని అవస్థలు
- కూటమి ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న ప్రజలు

గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్న సిబ్బందికి వేర్వేరు ఇతర విధులు కేటాయించడంతో ప్రజలకు సేవలు చేసే సమయమే ఉండటం లేదు. గత ప్రభుత్వం ప్రజల కోసం ఈ వ్యవస్థను తీసుకొచ్చింది. వీటి ద్వారా సేవలు ప్రజలు ఇంటి వద్దకు వెళ్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు మళ్లీ ఆయా కార్యాలయాల చుట్టూ తిరగక తప్పని పరిస్థితి నెలకొంది.

వేమూరు: మండలంలోని బలిజేపల్లి గ్రామ సచివాలయం కార్యాలయంలో అధికారుల సీట్లు గురువారం ఖాళీగా కనిపించాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు జరిగాయి. బలిజేపల్లి పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సింధు బదిలీపై పెనుమర్రు గ్రామ పంచాయతీకి వెళ్లారు. అప్పటి నుంచి బలిజేపల్లిలో కార్యదర్శి స్థానం ఖాళీగా ఉంది. గ్రామ సచివాలయంలో పని చేసిన సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ బదిలీపై పెనుమర్రు గ్రామ సచివాలయానికి వెళ్లారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ కూడా ఇటీవల స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. అసిస్టెంట్ ఇంజినీరును మండల పరిషత్ కార్యాలయంలోని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ వద్ద విధులకు కేటాయించారు. డిజిటల్ అసిస్టెంట్ కూడా ప్రసూతి సెలవులపై వెళ్లారు. వీఆర్వో, సర్వేయర్లు రీ సర్వే కోసం అబ్బనగూడవల్లి వెళ్లారని కార్యాలయంలోని సిబ్బంది చెప్పారు. దీంతో సీట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండటం లేదని, సకాలంలో అవసరమైన పనులు చేయడం లేదని స్థానికులు ఆరోపించారు.



బలిజేపల్లి గ్రామ సచివాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బంది సీట్లు

నిబంధనల ప్రకారం చర్యలు



దీనిపై ఎంపీడీవో రవి కుమార్‌ను వివరణ కోరగా... గ్రామ సచివాలయం సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ పెంచుతామని పేర్కొన్నారు. సక్రమంగా పనిచేయకపోతే బాధ్యులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు

చేనేత సంఘాలకు బకాయిలు చెల్లించండి



మాట్లాడుతున్న బాలాజీ

భట్టిప్రోలు: చేనేత సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నిర్వహించనున్న కేబినేట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుని నిధులు విడుదల చేయాలని కోరారు. గురువారం భట్టిప్రోలులోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని చేనేత సొసైటీలకు ప్రభుత్వం రూ. 127.87 కోట్లు బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. సొసైటీలు దీనస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. చేనేతల కష్టాలు తీరుస్తామని హామీలిస్తున్న కూటమి నేతలు ఈ బకాయిలను ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్మికులకు నెలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ జీవో జారీ చేసి నాలుగు నెలలు గడుస్తున్నా అమలు కావడం లేదని తెలిపారు. పాలక వర్గ ఎన్నికలు నిర్వహించేందుకు కేబినేట్ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విజయవాడలోని ధర్నా చౌక్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కె. రామకోటేశ్వరరావు, కె. పార్థసారథి, ఏఐటీయూసీ నియోజక వర్గ అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరహరి

ప్రత్తిపాడు: తాళాలు వేసి ఉన్న ఇంట్లో బంగారాన్ని అపహరించుకుపోయిన ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన చేబ్రోలు నాగేశ్వరరావు తల్లితో కలిసి స్థానికంగా నివాసం ఉంటూ క్షౌర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం తెల్లవారుజామున షాపులో పని చేసుకునేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న తల్లి తొమ్మిది గంటలకు ఇంటికి తాళం వేసి ఆ తాళం చెవులను బాత్రూమ్‌లోని బిందెలో ఉంచి వ్యవసాయ పనులకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన కుమారుడు ఇంటి తాళాలు తీసి ఉండటం గమనించాడు. తన తల్లి తాళాలు వేయకుండా మరిచిపోయి పొలం పనులకు వెళ్లి ఉంటుందని భావించి మిన్నకుండిపోయాడు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం తల్లి ఇంటిని ఊడుస్తున్న సమయంలో అలమారాలో ఉంచిన బియ్యం డబ్బా కనిపించలేదు. దీంతో కుమారుడికి విషయాన్ని చెప్పింది. ఆయన పోలీసులను ఆశ్రయించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నరహరి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బియ్యం డబ్బాలో సుమారు ఎనిమిది సవర్ల బంగారం, రూ. పది వేల నగదును ఉన్నట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. రంగంలోనికి దిగిన క్లూస్ టీం వేలిముద్రలు. ఆధారాలను సేకరించింది. ఈ మేరకు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

11న నృసింహ సదనం మొదటి అంతస్తు ప్రారంభం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమాఖ్య ప్రతినిధులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన బుచ్చి రాంప్రసాద్ చేతులమీదుగా ఈ నెల 11వ తేదీన నృసింహ సదనం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం జరగనుంది. అనంతరం చైర్మన్ ఆత్మీయ అభినందన సభను తెనాలిలోని వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు నాజరుపేటలోని శ్రీవిద్యాశంకర భారతి నృసింహ సదనంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కోశాధికారి తిరుమలరావు, ఉపాధ్యక్షులు కుందేటి వెంకటసుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి మేళ్లచెరువు అనిల్ కుమార్, టి.ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు నందివెలుగు రామకృష్ణ శర్మ, ఎల్లాప్రగడ పద్మజ, కొడవటిగంటి కమలేంద్ర కుమార్, చింతలపాటి సీతారామశాస్త్రి పాల్గొన్నారు.

సస్యరక్షణతో నాణ్యమైన దిగుబడి



రేపల్లె: సస్యరక్షణ ద్వారా నాణ్యమైన అధిక పంట దిగుబడిని సాధించాలని మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్‌బాబు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పూడి గ్రామంలో రైతులకు క్షేత్రస్థాయిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పలు సూచనలు చేశారు. సాగులో విత్తనం ఎంపిక నుంచి విక్రయించే వరకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రస్తుతం సాగు పొట్ట ఈనే దశలో ఉందని, ఎలుకల నివారణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ భవాని, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్: అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ట్రంప్ సుంకాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అంశంపై పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశంపై విధించే సుంకాలపై, ప్రధాన మంత్రి అవలంబిస్తున్న లొంగుబాటు విధానంపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. విధించిన సుంకాలతో దేశంలో రొయ్యలు, చేపలు, పత్తి, వస్త్ర వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. దీంతో ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోతుందని తెలిపారు. మంగళగిరిలో నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. దీనిపై ఈనెల 17న ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి పేదలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్నవారు ఉన్నారన్నారు. ఇలాంటి తరుణంలో భారత రాజ్యాంగానికి, న్యాయవ్యవస్థకు తూట్లు పొడిచేందుకు బీజేపీ చూస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఓట్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం ఈనెల 13,14,15 తేదీల్లో కార్పొరేషన్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు జరుగుతాయని తెలియజేశారు. గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వీవీ జవహర్ లాల్, నాయకులు జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు జయప్రదం చేయండి

దుగ్గిరాల: రాష్ట్రంలో వ్యవసాయాన్ని 80 శాతం మంది కౌలు రైతులు, సన్నకారు రైతులే పంట సాగుచేస్తున్నారని, కౌలు రైతు సంఘాల పోరాట ఫలితంగా 2011లో ఉన్న కౌలు రైతు రక్షణ చట్టం 2011 రద్దు చేయడంతో కౌలు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వర రావు తెలిపారు. దుగ్గిరాల మండలం చిలువూరులో గ్రామ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల హక్కుల రక్షణకు 13, 14 తేదీల్లో దీక్షలు చేపడుతున్నట్లు దానిలో భాగంగా 13న దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకొన్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఎం.అంజియ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జెట్టి బాలరాజు, శ్రీను, వీరయ్య, గోపాలరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాల కోసం కృషి అవసరం



చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న డీపీవో నాగ సాయికుమార్

తెనాలి టౌన్: స్వచ్ఛ గ్రామాల పరిరక్షణకు ప్రజలు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్ పిలుపునిచ్చారు. రూరల్ మండలం కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో ట్రాక్టర్‌లో తరలింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రహదారుల వెంట వ్యర్థాలు వేయవద్దని ప్రజలకు సూచించారు. స్వచ్ఛ పరిసరాలు, గ్రామాల కోసం ప్రజల సహకారం అవసరం అన్నారు. కార్మికులు ఇంటికి వచ్చినప్పుడు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వై.వి.డి. ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ కరిముల్లా, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వేద పరీక్షలో ప్రతిభ చాటిన తెనాలి విద్యార్థి

తెనాలి: తెనాలిలోని ‘శ్రీవారి సన్నిధి’లో జరిగిన శ్రీకంచి వేద వేదాంత శాస్త్ర సభ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బుధవారం తిరుపతి కంచిమఠంలో కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి పట్టాలను ప్రదానం చేశారు. ‘తెనాలి పరీక్ష’గా వ్యవహరించే ఈ పరీక్ష భాగవతుల ఆంజనేయశర్మ నేతృత్వంలో ఏటా రెండు సెమిస్టర్ల చొప్పున జరుగుతుంది. గత జూన్‌లో జరిగిన పరీక్షలో 11 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పట్టణ పరిధి పినపాడుకు చెందిన నోరి కేదారేశ్వరశర్మ ఒకరు. ఈయన బెనారస్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్న కుప్పా బిల్వేష్ శర్మ శిష్యుడు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఈయన శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామి నుంచి పట్టాను అందుకున్నారు. కేదారేశ్వరశర్మకు పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

సైనికులను యువత ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దేశం కోసం నిస్వార్థంగా ప్రాణాలు అర్పిస్తున్న సైనికులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ‘ప్రాసమణి’ అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వర రావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుబ్రహ్మణ్యేశ్వర రావు తన ప్రాస వ్యాఖ్యానంతో విద్యార్థులను హుషారెత్తించారు. తల్లిదండ్రులను ప్రేమించడంతో పాటు మాతృదేశాన్ని అభిమానిస్తూ, భారత సైనికుల వీర త్యాగాలను గుర్తించడం, విద్యాదానం చేసే అధ్యాపకులను గౌరవించడం విద్యార్థులు విధి అన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు కళాశాల యాజమాన్యం కృషి చేస్తోందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక వసతులతో చదువుతో పాటు ఉద్యోగాలను కల్పించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోపీచంద్ మాట్లాడుతూ స్టూడెంట్ ఇండక్షన్ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు నిర్వహించనున్నామని తెలిపారు. కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన, గ్రంథాలయం, పరిశోధన శాలలు వంటి వసతులను గురించి వివరించారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాల్వలపై ఆక్రమణలను తొలగించండి



తెనాలి అర్బన్: కాల్వలపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. 14వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం ఆమె పరిశీలించారు. మురుగు కాల్వలపై చిరు వ్యాపారాలు నిర్వహించడాన్ని గమనించిన ఆమె వెంటనే వాటిని తొలగించాలన్నారు. కాల్వలపై వీటిని ఏర్పాటు చేయడం వలన పూడికతీత పనులు చేయడం కష్టసాధ్యంగా మారిందన్నారు. ప్రజలందరూ మురుగు కాల్వలపై ఎటువంటి వస్తువులను పెట్టవద్దని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు, టీపీవో సాంబశివరావు, ఇన్‌చార్జి ఏఈ జానీబాషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

